అమెరికా–చైనా టెక్ వార్

ఇరు దేశాల మధ్య మళ్లీ వాణిజ్య యుద్ధం
సెమీకండక్టర్ ఇండస్ట్రీలో ఆధిపత్య పోరు

చిప్ తయారీ రంగం కేంద్రంగా పరస్పర ఆంక్షలు
ట్రంప్ రాకముందే రాజుకున్న మంటలు



వాషింగ్టన్/బీజింగ్, డిసెంబర్ 4: అమెరికా–చైనా మధ్య వాణిజ్య యుద్ధం మళ్లీ మొదలైంది. అయితే ఈసారిది టెక్నాలజీ వార్‌ను సంతరించుకున్నది. చిప్ తయారీపై తీవ్ర ప్రభావం చూపేలా ఇరు దేశాలు పరస్పర ఆంక్షల్ని, నిషేధాల్ని తెచ్చిపెట్టుకున్నాయి మరి. ఈ మేరకు సోమవారం బైడెన్ సర్కారు నిర్ణయాలుంటే.. వాటికి ప్రతిగా మంగళవారం జిన్‌పింగ్ ప్రభుత్వం నిర్ణయాలు వచ్చాయి. నిజానికి గ్లోబల్ సెమీకండక్టర్ ఇండస్ట్రీలో అమెరికా, చైనాలు ఆధిపత్యం కోసం గత కొంతకాలం నుంచి కొట్టుకుంటున్నాయి. దాన్ని తీవ్రతరం చేస్తూ అమెరికా కొన్ని కొత్త నిబంధనల్ని తీసుకొచ్చింది. ఇవి 140 చైనా సంస్థల్ని ప్రభావితం చేస్తున్నాయి. ఇందులో ప్రధాన సెమీకండక్టర్ తయారీ సంస్థలైన పయోటెక్, సైక్యారియర్, నౌరా టెక్నాలజీ గ్రూప్‌లున్నాయి. కాగా, అడ్వాన్స్‌డ్ సెమీకండక్టర్ (చిప్) తయారీ టెక్నాలజీ చైనాకు అందకూడదనే లక్ష్యంగా ఆయా ఎగుమతులపై అమెరికా ఆంక్షల్ని విధించినట్టు తెలుస్తున్నది. కటింగ్–ఎడ్జ్ అడ్వాన్స్‌మెంట్స్ సాంకేతికతలో చైనా దూకుడుగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో దానికి బ్రేకులు వేసేందుకే ఆ టెక్నాలజీలో బలంగా ఉన్న అగ్రరాజ్యం ఈ చర్యలకు దిగిందన్న అభిప్రాయాలు ఇండస్ట్రీ వర్గాల నుంచి వ్యక్తమవుతున్నాయి.

చైనా ప్రతీకార చర్యలు

అమెరికా తీరుకు చైనా గట్టిగానే స్పందించింది. సెమీకండక్టర్ల తయారీలో కీలక పాత్ర పోషించే విడిభాగాల ఎగుమతులకు బ్రేక్ వేసింది. అమెరికాకు గాలియం, జర్మేనియం, ఆంటిమొని తదితర ప్రధాన హై టెక్నాలజీ సరకు రవాణాకు కళ్లెం వేసింది. జాతీయ భద్రతపై ఆందోళనల దృష్ట్యా మిలిటరీ కోసమైనా, పౌర అవసరాల కోసమైనా జరిగే వీటి ఎగుమతుల్ని నిషేధిస్తున్నట్టు చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఇంతకుముందు వీటి ఎగుమతులపై ఆంక్షలుండగా, ఇప్పుడు పూర్తిగా నిషేధాన్ని తెచ్చింది. ప్రపంచవ్యాప్తంగా గాలియం, జర్మేనియం లభ్యత చాలా చాలా తక్కువగా ఉన్నది. దొరికే ఆ కొద్ది నిల్వలు సైతం చైనాలోనే ఎక్కువగా ఉన్నాయి. కాగా, సెల్‌ఫోన్లు, కార్లు, సోలార్ ప్యానెల్స్, మిలిటరీ టెక్నాలజీల్లో వాడే కంప్యూటర్ చిప్స్ తయారీకి ఈ ముడి పదార్థాలన్నీ కూడా చాలా చాలా కీలకం. ఇంకా చెప్పాలంటే మిలిటరీ అప్లికేషన్ల దగ్గర్నుంచి కృత్రిమ మేధస్సు వరకు ఈ సెమీకండక్టర్లే ప్రధానం. దీంతో అమెరికా–చైనా వాణిజ్య సంబంధాలు ఒక్కసారిగా చెడినట్లైంది. అంతకుముందు అమెరికా.. కొత్త తరం సాంకేతికతతోకూడిన చిప్‌ల తయారీలో వినియోగించే పరికరాలు, అత్యున్నత శ్రేణి మెమరీ చిప్స్, సాఫ్ట్‌వేర్ ఉత్పత్తుల ఎగుమతుల్ని కఠినతరం చేసింది. గతంలోనూ వీటిపై నిషేధం విధించినా ఆ తర్వాత సడలించింది. మానవ సాయంతో నిమిత్తం లేకుండా స్వయంప్రతిపత్తితో పనిచేయగలిగిన ఆయుధాల తయారీలో ఈ చిప్‌లే కీలకం. వాటి విడిభాగాలు ప్రస్తుతం అమెరికా నుంచే చైనాకు పెద్ద ఎత్తున వెళ్తున్నాయి.

ట్రంప్ రాకముందే..

అమెరికా నూతన అధ్యక్షుడిగా మరోసారి డొనాల్డ్ ట్రంప్ వచ్చే ఏడాది జనవరిలో గద్దెనెక్కబోతున్నారు. ఈ క్రమంలో ట్రంప్ వచ్చిన తర్వాత అమెరికా–చైనా మధ్య వాణిజ్య యుద్ధం మళ్లీ మొదలవుతుందన్న అంచనాలు నెలకొన్నాయి. కానీ ఇప్పుడే ఆ వాతావరణం ఏర్పడటం సర్వత్రా ఆసక్తికరంగా మారింది. నిజానికి ప్రస్తుత అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కంటే ఆ స్థానంలో ముందున్నది ట్రంపే. అప్పుడు ట్రంప్ దూకుడు.. చైనాతో పరస్పర సుంకాలకు దారితీసింది. కానీ బైడెన్ రాకతో పరిస్థితులు కొంత శాంతించాయి. అయినప్పటికీ గత మూడేండ్లలో అమెరికా–చైనా మధ్య ఈ రకమైన పోరు వస్తూపోతూనే ఉన్నది. ఇప్పుడది తీవ్రరూపం దాల్చగా.. ట్రంప్ రాకతో ఇంకెంత తీవ్రతను సంతరించుకుంటుందోనన్న ఆందోళనలు అంతటా వ్యాపిస్తున్నాయిప్పుడు. ఇక ట్రంప్ హయాంలో చైనా నుంచి అమెరికాకు పెద్ద ఎత్తున జరిగే ఎగుమతుల కట్టడే లక్ష్యంగా సుంకాల పెంపు జరిగింది. కానీ ఇప్పుడు చిప్ తయారీలో ఆధిపత్యం కేంద్రంగా నిర్ణయాలుంటున్నాయి. మొత్తానికి వచ్చే ఏడాది నుంచి సెమీకండక్టర్ ఇండస్ట్రీల్లో అలజడులు ఖాయమనే చెప్పవచ్చు.

భారత్‌కు లాభమేనా?

అమెరికా–చైనా మధ్య చోటుచేసుకున్న ఈ ట్రేడ్ అండ్ టెక్ వార్.. భారత్‌కు లాభమేనా? అంటే అవుననే సమాధానాలే వస్తున్నాయి. ఇందుకు ట్రంప్ హయాంలో వచ్చిన అవకాశాల్నే గుర్తుచేస్తున్నారు. నాడు చైనాతో అమెరికా వాణిజ్యం పడిపోగా.. భారత్‌సహా మరికొన్ని దేశాలకు పెరిగింది. అమెరికాకు భారత్, వియత్నాం, మెక్సికో నుంచి ఆయా ఉత్పత్తుల ఎగుమతి పుంజుకున్నది. ఇప్పుడు కూడా అమెరికా సాయంతో సెమీకండక్టర్ ఇండస్ట్రీలో భారత్ నిలదొక్కుకోవచ్చన్న అంచనాలున్నాయి. నిజానికి అంతర్జాతీయంగా భారత్ ఎదుగుదలను చైనా అడ్డుకుంటున్నది. కానీ ఇదే సమయంలో భారత్‌పట్ల అమెరికా సానుకూల వైఖరిని ప్రదర్శిస్తున్నది. పైగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి, డొనాల్డ్ ట్రంప్‌కు నడుమ మంచి స్నేహభావం ఉండటం కూడా ఇక్కడ కలిసొస్తుందని అంటున్నారు. భారత్ వంటి పెద్ద మార్కెట్‌ను వదులుకోవడం అమెరికాకు నష్టమేనని, కాబట్టి సాంకేతికంగా అగ్రరాజ్యం నుంచి సహకారం ఉంటుందనే ఇండస్ట్రీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. అయితే అమెరికా తాజా నిర్ణయం జపాన్, దక్షిణ కొరియా, సింగపూర్ తదితర దేశాలనూ కొంత ఇబ్బంది పెడుతున్నది. దీంతో ఆసియా మార్కెట్‌లో అమెరికా–చైనా ట్రేడ్ వార్ గట్టిగానే ప్రకంపనల్ని సృష్టించేలా ఉన్నది.

జపాన్‌కు చెందిన వాహన తయారీ సంస్థ హోండా.. థర్డ్ జనరేషన్‌గా దేశీయ మార్కెట్‌లోకి సరికొత్త అమేజ్ మాడల్‌ను విడుదల చేసింది. మూడు రకాల్లో లభించనున్న ఈ కారు ధరల శ్రేణి రూ.7.99 లక్షల నుంచి రూ.10.89 లక్షలుగా ఉన్నది.

జహీరాబాద్ నిమ్జ్‌లో ప్యూర్ ఈవీ ప్లాంట్

రూ.400 కోట్లతో ఏర్పాటు చేస్తున్న సంస్థ

హైదరాబాద్, డిసెంబర్ 4: రాష్ర్టానికి చెందిన ప్రముఖ ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన తయారీ సంస్థ ప్యూర్ ఈవీ..తెలంగాణలో మరో ప్లాంట్‌ను ఏర్పాటు చేయడానికి సిద్ధమవుతున్నది. ఇప్పటికే సంగారెడ్డి వద్ద ప్లాంట్ ఉండగా, కొత్తగా జహీరాబాద్ నిమ్జ్‌లో రూ.400 కోట్ల పెట్టుబడితో మరో ఉత్పత్తి కేంద్రాన్ని నెలకొల్పబోతున్నట్లు కంపెనీ ఫౌండర్, ఎండీ నిశాంత్ డొంగ్రీ తెలిపారు. 40 ఎకరాల స్థలంలో ఏర్పాటు చేయబోతున్న ఈ యూనిట్ వచ్చే రెండేండ్లలో అందుబాటులోకి రానున్నట్లు చెప్పారు. నెలకు 12 వేల నుంచి 15 వేల యూనిట్ల సామర్థ్యం కలిగిన ఈ ప్లాంట్ ఏర్పాటు చేయడంతో కొత్తగా వెయ్యి మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయన్నారు. ప్రస్తుతం ఉన్న సంగారెడ్డి ప్లాంట్‌తో 500 మంది ఉపాధి పొందుతున్నారన్నారు. కంపెనీకి చెందిన వాహనాలకు దేశవ్యాప్తంగా డిమాండ్ అధికంగా ఉండటంతో

ఈ నూతన ప్లాంట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. అలాగే ప్రస్తుతం దేశీయంగా 70 రిటైల్ అవుట్‌లెట్లు ఉన్నాయని, వచ్చే రెండున్నరేండ్లలో మరో 250 డీలర్‌షిప్‌లను ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. మరోవైపు, స్కూటర్, మోటార్‌సైకిళ్లలోనూ కృత్రిమ మేధస్సు ఆధారిత సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది.

ప్రముఖ వంటనూనెల ఉత్పత్తి సంస్థ గోల్డ్‌డ్రాప్‌ను మరోసారి ప్రతిష్ఠాత్మక సీఐటీడీ అవార్డు వరించింది. ఈ అవార్డును తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా గోల్డ్‌డ్రాప్ సేల్స్ అండ్ మార్కెటింగ్ డైరెక్టర్ మితేష్ లోహియా అందుకున్నారు.

9 నుంచి అసెంబ్లీ సమావేశాలు

హైదరాబాద్, డిసెంబర్ 4 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర శాసనమండలి, శాసనసభ సమావేశాలు ఈనెల 9వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ జారీ చేసిన గెజిట్ ఆధారంగా అసెంబ్లీ కార్యదర్శి వీ నర్సింహాచార్యులు నోటిఫికేషన్ విడుదల చేశారు.

బుర్రా వీఆర్‌ఎస్‌కు ఆమోదం

నేడు టీజీపీఎస్సీ చైర్మన్‌గా బాధ్యతలు

హైదరాబాద్, డిసెంబర్ 4 (నమస్తేతెలంగాణ): సీనియర్ ఐఏఎస్ బుర్రా వెంకటేశం స్వచ్ఛంద పదవీ విరమణకు ఆమోదం తెలుపుతూ సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు జారీచేశారు. విద్యాశాఖ స్పెషల్ సీఎస్‌గా పనిచేస్తున్న ఆయన్ని టీజీపీఎస్సీ చైర్మన్‌గా నియమించిన విషయం తెలిసిందే.

యూపీఐ లైట్ పరిమితి 5 వేలకు పెంపు

ముంబై, డిసెంబర్ 4: యూపీఐ లైట్‌కు సంబంధించి ఆర్థిక లావాదేవీలు జరిపేవారికి రిజర్వుబ్యాంక్ శుభవార్తను అందించింది. యూపీఐ లైట్ వ్యాలెట్ పరిమితిని రూ.2 వేల నుంచి రూ.5 వేలకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నది. డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించే ఉద్దేశంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సెంట్రల్ బ్యాంక్ వెల్లడించింది. అలాగే ఒక్కో లావాదేవీ పరిమితిని రూ.500 నుంచి రూ.1,000కి సవరించింది. ఎలాంటి పిన్ నంబర్ లేకుండానే ఆఫ్‌లైన్‌లో మొబైల్ ద్వారా లావాదేవీలు జరిపేందుకుగాను ఆర్బీఐ గతంలోనే లైట్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ సేవల కోసం యూపీఐ లైట్ వ్యాలెట్‌ను నగదు ఉంచాల్సి ఉంటుంది.

హైదరాబాద్‌లో గూగుల్ సేఫ్టీ సెంటర్

ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న సంస్థ

హైదరాబాద్, డిసెంబర్ 4(నమస్తే తెలంగాణ): ఇంటర్నెట్ సర్ఫ్ ఇంజిన్ దిగ్గజం గూగుల్..హైదరాబాద్‌లో సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్(జీఎస్‌ఈసీ)ని నెలకొల్పడానికి ముందుకొచ్చింది. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంతో అధికారిక ఒప్పందాన్ని కుదుర్చుకున్నది. దేశంలో తొలి సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్ కాగా, అలాగే ప్రపంచంలోనే ఐదోది కావడం విశేషం. ఈ జీఎస్‌ఈసీ ఏర్పాటుకు సంబంధించి గూగుల్ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ రాయల్ హాన్సెన్..రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ–పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబుతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. అనంతరం హాన్సెన్ మాట్లాడుతూ..డిజిటల్ స్కిల్ డెవలప్‌మెంట్‌లో రాష్ట్రం ముందంజలో ఉన్నదని, ప్రపంచవ్యాప్తంగా ఐటీ, ఐటీ ఇంజినీరింగ్ సర్వీసెస్ అభివృద్ధికి హైదరాబాద్ కేంద్రంగా ఉన్నదన్నారు. ఈ నూతన సేఫ్టీ సెంటర్ ద్వారా సైబర్ సేఫ్టీ సమస్యలను వేగవంతంగా పరిష్కరించడానికి వీలు పడనున్నదన్నారు. అలాగే ఈ సెంటర్‌తో వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

ఆన్‌లైన్ భద్రతా ఉత్పత్తులకు కిక్కు

జీఎస్‌ఈసీ ప్రత్యేకమైన అంతర్జాతీయ సైబర్ సెక్యూరిటీ హబ్. ఇది అధునాతన భద్రత, ఆన్‌లైన్ భద్రతా ఉత్పత్తులను అభివృద్ధి చేయడంలో కీలక పాత్ర పోషించనున్నది. ఏఐ ఆధారిత భద్రత, సైబర్ సెక్యూరిటీ నిపుణులు, పరిశోధకులకు ఈ సేఫ్టీ సెంటర్ సహకారం అందించనున్నది. ఇదిలావుంటే దేశంలో నైపుణ్యాభివృద్ధిని, సైబర్ సెక్యూరిటీ సామర్థ్యాలు పెంపొందించే లక్ష్యంగా ఈ సెంటర్ పని చేయనున్నది.

సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబుతో గూగుల్ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ రాయల్ హాన్సెన్

కొనసాగుతున్న రుపీ పతనం

ముంబై, డిసెంబర్ 4: దేశీయ కరెన్సీకి మరిన్ని చిల్లులు పడ్డాయి. అంతర్జాతీయ ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌కు అనూహ్యంగా డిమాండ్ నెలకొనడంతో రూపాయి చారిత్రక కనిష్ఠ స్థాయికా జారుకున్నది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 7 పైసలు కోల్పోయి 84.75 వద్దకు పడిపోయింది. గ్లోబల్ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు భగ్గుమనడం వల్లనే కరెన్సీలు పతనం చెందాయని ఫారెక్స్ డీలర్ వెల్లడించారు. 84.66 వద్ద ప్రారంభమైన రుపీ–డాలర్ రేటు 64.65–84.76 స్థాయిలో కదలాడింది.

ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈవో బన్నాజీ, ఉపాధ్యాయులు

ఉపాధ్యాయులకు వీడ్కోలు ..

వేములవాడ, డిసెంబర్ 4 : వేములవాడ పురపాలక సంఘం పరిధిలోని బాలానగర్ ప్రభుత్వ పాఠశాలలో 12 ఏండ్లుగా పనిచేస్తూ బదిలీ అయిన ఉపాధ్యాయులు పూరడి రవి, లింగంపల్లి రాజుకు బుధవారం ఆత్మీయ బదిలీ వీడుకోలు తెలిపారు. కరోనా సమయంలో మూతబడిన ప్రభుత్వ పాఠశాలను తిరిగి మళ్లీ పునర్ నిర్మాణం చేసి, 20 మంది పిల్లలతో తిరిగి ఈ ఉపాధ్యాయులు బడికి ప్రాణం పోశారు. ఉపాధ్యాయ వృత్తి చాలా గొప్పదని ప్రభుత్వ పాఠశాలలో చదివిన పిల్లలకు అనేకమైన వసతులతో ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతున్నందున ప్రభుత్వ పాఠశాలలో పిల్లలు కచ్చితంగా విద్యను అభ్యసించాలని. మౌలిక వసతులు విషయంలో అమ్మ ఆదర్శ పాఠశాలలను చేర్చి పాఠశాల మౌలిక వసతులు కల్పిస్తున్న ప్రభుత్వం ఆకాశాలను అందిపుచ్చుకోవాలని ఎంఈవో బన్నాజీ అన్నారు. అంకితభావంతో పనిచేసి బడిని బతికించిన ఈ ఉపాధ్యాయుల పనితీరు ఎప్పటికీ ఈ పాఠశాల పరిధిలోని ప్రజలు మరిచిపోరని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంప్లె సెక్షన్ రాజరత్నం, ఉపాధ్యాయులు మాధవి, వెంకటేశ్, విద్యార్థులు ఉన్నారు.

బెదిరింపులకు పాల్పడుతున్న మహిళ అరెస్ట్

వేములవాడ, డిసెంబర్ 4 : పెళ్లి పేరుతో బెదిరింపులకు పాల్పడుతూ డబ్బులు డిమాండ్ చేస్తున్న అ నూషను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వీర ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేములవాడ రాజన్న ఆలయంలో ఏఈగా పనిచేసి, ఉద్యోగ విరమణ పొందిన ద్వారకా శేఖర్‌ను హోంగార్డ్‌గా విధులు నిర్వర్తిస్తున్న అనూష తన భర్త ఆరోగ్యం బాగాలేదని చెప్పి, శేఖర్ దగ్గర నుంచి రూ. 3 లక్షల 50 వేలు అప్పుగా తీసుకుందని, ఆరు మాసాల తర్వాత తిరిగి ఇస్తానని చెప్పి నమ్మించిన సదరు మహిళ.. తిరిగి డబ్బులు ఇవ్వకపోగా, అప్పు తిరిగి ఇవ్వాలని అడిగిన శేఖర్‌ను పెళ్లి పత్రిక, మార్ఫింగ్ చేసిన ఫోటోలతో అసత్యం ప్రచారం చేస్తూ.. రూ. 5 లక్షల డిమాండ్ చేసిందని పేర్కొన్నారు. దీంతో భయపడిన శేఖర్ రూ. 5 లక్షలు ఇచ్చినప్పటికీ మళ్లీ అదే బెదిరింపులకు పాల్పడుతుండంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడని తెలిపారు. దీంతో సదరు అనూషను అరెస్టు చేసి, రిమాండ్ తరలించినట్లు సీఐ తెలిపారు.

'హిందువులపై దాడులను ఆపాలి'

సిరిసిల్ల టౌన్, డిసెంబర్ 4: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ బుధవారం జిల్లా కేంద్రంలో హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో భారీ ర్యాలీ తీశారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం నుంచి అంబేద్కర్ చౌక్ మీదుగా ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా హిందూ ఐక్యవేదిక నాయకులు మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో హిందువుల పై జరుగుతున్న దాడులను వెంటనే అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హిం దూ ఐక్యవేదిక నాయకులు, తదితర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వేములవాడలో హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ

వేములవాడ టౌన్, డిసెంబర్ 4: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా హిందూ ఐక్యవేదిక ప్రతినిధులు వేములవాడలో బుధవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. అనంతరం వేములవాడలోని నటరాజ విగ్రహం వద్ద నుంచి వాహనాలపై సిరిసిల్లకు బయలు దేరి వెళ్లి అక్కడ కూడా ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎర్రం మహేశ్, అల్లాడి రమేశ్ రేగుల మల్లికార్జున్, గర్శకుర్తి వెంకన్న, పుల్లారెడ్డి, గడప కిశోర్‌రావు, గోపాల్, మోటూరి మధు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి ప్రతిభకు ప్రోత్సాహకం

ఎల్లారెడ్డిపేట, డిసెంబర్ 4 : దుమాల ఏకలవ్య మాడల్ రెసిడెన్షియల్ కళాశాల విద్యార్థి నిట్‌లో సీటు సాధించిన సందర్భం గా ఈఎంఆర్‌ఎస్ ఆధ్వర్యంలో రూ. 40 వేలు ప్రోత్సాహకం అందించినట్లు ప్రిన్సిపాల్ మంజీత్ బుధవారం తెలిపారు. గతేడా ది తమ పాఠశాలలో చదివి నీట్ సాధించిన విద్యార్థి సుజాతకు అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్ చేతుల మీదుగా చెక్కును అందించామని చెప్పారు. విద్యార్థిని పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

ఏపీవో అరుణతో మాట్లాడుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

నర్సరీ తొలగించాలి

గంభీరావుపేట, డిసెంబర్ 4 : మండలంలోని మల్లుపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలోని నర్సరీని తొలగించాలని బుధవారం విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేశారు. పాఠశాల ఆవరణలో నర్సరీ ఏర్పాటు చేసి మొక్కలు పెంచడంతో పాములు, తేళ్లు పాఠశాలలోకి చేరేప్రమాదం ఉందని, విద్యార్థుల తల్లిదండ్రులు ఏపీవో అరుణకు మొరపెట్టుకున్నారు. ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని తెలిపారు. ఇప్పటికైనా పాఠశాల ఆవరణలో నర్సరీని తొలగించాలని డిమాండ్ చేశారు.

ముగ్గురి దొంగల రిమాండ్

మెట్‌పల్లి సర్కిల్ కార్యాలయంలో దొంగల అరెస్ట్‌ను చూపుతున్న పోలీసులు

మెట్‌పల్లి, డిసెంబర్4: పలు గ్రామాల్లో చోరీలకు పాల్పడిన ముగ్గురి నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. మెట్‌పల్లి సర్కిల్ కార్యాలయంలో బుధవారం నిందితుల వివరాలను సీఐ నిరంజన్‌రెడ్డి వెల్లడించారు. గత నవంబర్ 16న రాత్రి మల్లాపూర్ మండల కేంద్రంలో రెండు దుకాణాల్లో సుమారు 34 తులాల వెండి నగలు, 28న రాత్రి మల్లాపూర్ మండలం ముత్యంపేట శివారులో హార్వేస్టర్‌కు సంబంధించిన ₹30వేలు విలువైన పనిముట్లు, ఈ నెల 1న రాత్రి మల్లాపూర్ మండలం చిట్టాపూర్ ఆలయ పూజారి బుక్క రాజేశం ఇంట్లో ₹10వేలు నగదును దుండగులు ఎత్తుకెళ్లగా, పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. విశ్వాసనీయ సమాచారంతో మల్లాపూర్ ఎస్‌ఐ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది ముత్యంపేట వద్ద బుధవారం సాయంత్రం వాహనాల తనిఖీ చేపట్టగా, ముత్యంపేటకు చెందిన గండ్ల మహిపాల్, ఎర్నాల సాయికుమార్, కర్రోల్ల రాకేశ్ బైక్‌పై అనుమానాస్పదంగా కనిపించారు. ఈ మేరకు ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించగా.. మూడు చోరీలకు పాల్పడింది తామేనని ఒప్పుకొన్నారు. ఈ క్రమంలో వారిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు. వారి నుంచి స్వాధీనం చేసుకున్న ₹30వేల విలుచేసే హార్వెస్టర్ పనిముట్లు, ₹10వేల నగదు, ₹5వేల విలువైన వెండి ఆభరణాలను కోర్టులో డిపాజిట్ చేస్తామని సీఐ పేర్కొన్నారు.

గ్యారంటీల గారడీతో కాంగ్రెస్ సర్కారు మోసం

జగిత్యాల టౌన్, డిసెంబర్ 4: ఆరు గ్యారంటీల గారడీతో కాంగ్రెస్ సర్కారు ప్రజలను మోసం చేస్తున్నదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ బోగ శ్రావణి మండిపడ్డారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజావ్యతిరేక కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తూ.. ఆరు గ్యారంటీల అమలుపై చార్జీషీట్ విడుదల చేశామన్నారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో ప్రజల జీవితాల్లో మార్పు మాత్రం రాలేదన్నారు. ఇక్కడ పట్టణాధ్యక్షుడు రంగు గోపాల్, మండలాధ్యక్షుడు నలువాల తిరుపతి, నాయకులు ఉన్నారు.

ప్రతిభను వెలుగులోకి తీసేందుకే పోటీలు

కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ

కలెక్టరేట్, డిసెంబర్ 4 : క్రీడాకారుల ప్రతిభను వెలుగులోకి తీసుకొచ్చేందుకే సీఎం కప్ పోటీలను ప్రభుత్వం నిర్వహిస్తున్నదని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ తెలిపారు. ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల సందర్భంగా జిల్లాలో సీఎం కప్ పోటీల నిర్వహణపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఆయా శాఖల అధికారులతో కలెక్టర్ , అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌తో కలిసి బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు.. జిల్లాలో సీఎం కప్–2024 క్రీడోత్సవాలు ఈ నెల 7 నుంచి జనవరి 2 వరకు 36 ఈవెంట్లలో పోటీలు నిర్వహిస్తున్న సందర్భంగా జిల్లా కమిటీ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీఎం కప్‌ను ఆయా గ్రామాలకు, మండలాలకు కేటాయించిన ఆటలను ఆయా క్రీడా ప్రాంగణాల్లో విజయవంతంగా నిర్వహించాలని తెలిపారు. ఇక్కడ యువజన అండ్ స్పోర్ట్స్ శాఖ అధికారి అజ్మీరా రాందాస్, డీఈవో జగన్ మోహన్ రెడ్డి, వేములవాడ మున్సిపల్ కమిషనర్ అన్వేశ్, ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం

కోరుట్ల, డిసెంబర్ 4: పట్టణంలోని భవిత కేంద్రంలో బుధవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో గంగుల నరేశం సమగ్ర శిక్ష విద్యాశాఖ నుంచి దివ్యాంగ విద్యార్థులకు అందే సౌకర్యాలు, ఉపకరణాల గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. దివ్యాంగులు ఫిజియోథెరపి క్యాంపులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఆటలపోటీల్లో విజేతలుగా నిలిచిన దివ్యాంగులకు బహుమతులు ప్రదానం చేశారు. ఇక్కడ స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం ఆనంద రావు, కృష్ణమోహన్‌రావు, శ్రీనివాస్, హెచ్‌హెచ్‌ఎం దామోదర్, స్పెషల్ టీచర్ ఉపేందర్, భవిత రిసోర్స్‌పర్సన్స్ భాగ్యలక్ష్మి, స్రవంతి, సాయమ్మ, సీఆర్పీలు గంగాధర్, దేవేందర్, కార్తీక్, సీసీవో రాజేశ్వర్, శేఖర్, తదితరులు ఉన్నారు.

యువతి పెండ్లికి చేయూత

జగిత్యాల టవర్ సర్కిల్, డిసెంబర్ 4: రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామానికి చెందిన తిరుమల అనూష పెండ్లికి శ్రీ సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో చేయూనందించారు. ₹14వేల విలువైన మంగళసూత్రం, మెట్టెలు, పెండ్లి చీర, ఇతర సామగ్రి, 25కిలోల బియ్యం అందించారు. ఇక్కడ సత్యసాయి సంస్థ కన్వీనర్ బట్టు రాజేందర్, చిటుమల్ల లక్ష్మీనారాయణ, ఎర్ర సత్తయ్య, వంగల లక్ష్మీనారాయణ, నలమాస్ రాజశేఖర్, పిప్పరి ఆంజనేయులు, పొన్నం సదాశివ్, మహిళా సభ్యులు ఉన్నారు.

అకాల వర్షం.. తడిసిన ధాన్యం

కోరుట్ల రూరల్, డిసెంబర్ 4: అకాల వర్షంతో బుధవారం పలు గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో రైతుల ధాన్యం తడిసింది. కొందరు రైతులు ధాన్యం తడవకుండా ప్లాస్టిక్ కవర్లను కప్పుకొన్నారు. ప్రభుత్వం వెంటనే ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.



కోరుట్ల వ్యవసాయ మార్కెట్‌లో తడిచిన వరి ధాన్యం

తాటిపెల్లి గురుకులం పరిశీలన

మల్యాల, డిసెంబర్ 4: తాటిపల్లి గురుకుల పాఠశాలను రాష్ట్ర విద్యా కమిటీ సభ్యుడు ప్రొఫెసర్ విశ్వేశ్వర్, జిల్లా కమిటీ సభ్యుడు మహేశ్‌కుమార్ బుధవారం పరిశీలించారు. పాఠశాల ఆవరణలోని తరగతి గదులు, హాస్టల్లోని వసతి గదులను తనిఖీ చేశారు. డార్మటరీ హాల్‌తో పాటు హాస్టల్ విద్యార్థులకు భోజనం పెట్టే వంట గదులను శుభ్రంగా ఉంచాలని సూచించారు. ఇక్కడ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మానస, అధ్యాపకులు, తదితరులు ఉన్నారు.

యాదవులను చైతన్యపర్చడమే లక్ష్యం

సమావేశంలో మాట్లాడుతున్న గనవేని మల్లేశ్‌యాదవ్

సారంగాపూర్, డిసెంబర్ 4: జిల్లాలో యాదవులను చైతన్యపర్చడమే లక్ష్యంగా ముందుకుసాగుతామని యాదవ సంఘం అడహక్ కమిటీ జిల్లా అధ్యక్షుడు గనవేని మల్లేశ్‌యాదవ్ పేర్కొన్నారు. బుధవారం బీర్‌పూర్ మండలం కొల్వాయి గ్రామంలో యాదవులతో ఆయన సమావేశమై, మాట్లాడారు. యాదవుల సమస్యల పరిష్కారానికి, సంఘాల బలలోపేతమే లక్ష్యంగా పని చేస్తామన్నారు. సమస్యలు, హక్కులు, తదితర అంశాలపై చర్చించారు. సంఘం సభ్యత్వాలను నమోదు చేసి, రసీదులు అందజేశారు. ఇక్కడ జిల్లా ముఖ్య సలహాదారు కొల్ముల రమణ, యాదవ సంఘం అడహక్ కమిటీ మండల ఇన్‌చార్జిలు చల్ల లక్ష్మణ్, పూరడి కొమురెల్లి, నరిగే తిరుపతి, అంజి, దామన్న, తిరుపతి, రాజు, సంఘం సభ్యులు ఉన్నారు.

మార్పంటే పథకాల పేర్లు మార్చుడేనా ?

వెల్గటూర్, డిసెంబర్ 4: మార్పుంటే గత ప్రభుత్వ పథకాలకు పెట్టిన పేర్లు మార్చుడేనా? కల్లిబొల్లి మాటలు చెప్పుకొంటూ కాలం వెళ్లదీయడమేనా.. అంటూ బీజేపీ ధర్మపురి నియోజకవర్గ కన్వీనర్ కొమ్ము రాంబాబు, ఇన్‌చార్జి కన్నం అంజయ్య కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. ఈ మేరకు కాంగ్రెస్ సర్కారు వైఫల్యాలపై రూపొందించిన చార్జ్‌షీట్ బుధవారం వారు విడుదల చేసి, మాట్లాడారు. అడ్డగోలుగా హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. కల్లిబొల్లి మాటలతో కాలం వెల్లదీస్తూ ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. ఏడాది పాలన పూర్తికావస్తున్నా హామీలు అమలుకు నోచుకోలేదన్నారు. ఇక్కడ జిల్లా అధికార ప్రతినిది మర్రిపల్లి సత్యం, నాయకులు కస్తూరి సత్యం, బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, పలు మండలాల అధ్యక్షులు రావు హనుమంతరావు, గోపతి జనార్దన్, గుజ్జుల వేణుగోపాల్‌రెడ్డి, సంగెపే గంగారాం, మెడవేని శ్రీధర్, కట్ట మహేశ్, తదితరులు ఉన్నారు.

దొంగతనం కేసులో నలుగురి అరెస్టు

తెలంగాణ చౌక్, డిసెంబర్ 4: సిరిసిల్ల పట్టణంలో వ్యక్తిని బెదిరించి దొంగతనానికి పాల్పడిన నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు టౌన్ సీఐ కృష్ణ బుధవారం ప్రకటన ద్వారా తెలిపారు. ఈ మేరకు పట్టణంలోని గాంధీ చౌక్ వద్దగల ఎస్ఆర్‌కే వైన్స్‌లో మందుకొనడానికి వచ్చిన కొల్లమద్ది భానుప్రసాద్‌ను గుర్తుతెలియని నలుగురు వ్యక్తులు బెదిరించి, రూ. 8 వేలు బలవంతంగా గుంజుకున్నట్లు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. సీసీ కెమెరా ఆధారంగా సిరిసిల్ల పట్టణం పద్మానగర్‌కు చెందిన అలువాల ప్రశాంత్, సంజీవయ్యనగర్‌కు చెందిన కొండా శేఖర్, రాకమ్ భరత్, నిఖిల్ వ్యక్తులను నిందితులుగా గుర్తించి వారి వద్ద నుంచి రూ. 2 వేలు, 4 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.